గ్రామాల్లో కోతుల బెడద

ఇళ్లలోకి చొరబడి బీభత్సం
- చిన్నారులు, మహిళలపై దాడులు
- నియంత్రణ చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు


ఇళ్ల మధ్యలో కోతుల గుంపు

వనాల్లో ఉండాల్సిన కోతులు జనావాసాల్లోకి చేరి గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నాయి. మండలంలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. ఏ గ్రామంలో చూసినా కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నాయి.

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని పలు గ్రామాల్లో కోతులు బెడద ఎక్కువగా ఉంది. జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో ఎక్కువ శాతం అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. దీంతో కోతుల పెద్ద ఎత్తున గ్రామాల్లోకి వస్తున్నాయి. అడవిలో కోతులకు తినడానికి ఏమి లభించకపోవడంతో అవి గ్రామాల్లోకి వస్తున్నాయి. పంట, పొలాలు, ఇళ్లు, భవనాలపై తిష్ట వేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.


ఇంట్లోకి వెళ్తున్న కోతి

వ్యాపార సముదాయాల్లో బీభత్సం

నిత్యం కోతులతో సావాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కసారిగా కోతుల గుంపులు, గుంపులుగా హల్‌చల్ చేస్తున్నాయి. దుకాణాల వద్ద దొరికినకాడికి ఎత్తుకొని పోతున్నాయి. దీంతో కిరాణా దుకాణాల యజమానులు, హోటల్ యాజమాన్యాలు కోతుల వల్ల తీవ్రంగా నష్టపోన్నామని వాపోతున్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగే సంతలో వ్యాపారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి.

చర్యలు శూన్యం..

కోతుల దాడులపై ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కోతులతో సావాసం..



నిత్యం కోతులతో సావాసం చేస్తున్నాం. పిల్లలతో బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. గతంలో చిన్నారులపై, వృద్ధులపై కోతులు దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
– సత్యమ్మ, జిన్నారం

చర్యలు తీసుకుంటున్నాం..

కోతులు గ్రామాల్లోకి రావడంపై ఫిర్యాదులు వస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో ప్రయాణించే వాహనదారులు తినుబండారాలు పండ్లను వాటికి వేయడంతో అవి నేరుగా గ్రామాల్లోకి వచ్చే ఆస్కారం ఉంది. గ్రామాల్లో ఆరుబయట వ్యర్థ పదార్థాలు వేస్తుండడంతో కోతులు సంచరిస్తున్నాయి. నివారణ చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం
–షాహీనా ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి

క్లుప్తంగా

చిరంజీవిని కలిసిన వ్యాపారవేత్త


చిరంజీవికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రామకృష్ణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్‌కు చెందిన రాష్ట్ర కాపు సంఘం నాయకులు, వ్యాపారవేత్త అరవ రామకృష్ణ మంగళవారం ఏపీటీఏ సభ్యులతో కలసి సినీనటుడు చిరంజీవిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అమెరికా నుంచి వచ్చిన వ్యాపారవేత్తలతో కలసి నటుడు చిరంజీవిని కలవడం ఆనందంగా ఉందన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ నేరస్తుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసగాళ్ల గురించి, చట్టం గురించి తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరం శ్రీనివాస్, ట్రైనీ ఎస్‌ఐ రాజు, టీచర్లు లక్ష్మణ్, మధుకర్‌రెడ్డి, సెంతోష్‌కుమార్, గురునాథ్, నాగభూషణం, మహేందర్, శ్రీరాం, సచిన్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు


సంగారెడ్డి టౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని బైపాస్ బాలాజీ నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తోపాజీ అనంతకిషన్ అన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగరాజు, ఉదయ భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, శివ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన మాలధారులు


శబరిమలకు బయలుదేరిన స్వాములు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని అయ్యప్ప దీక్షాధారులు మంగళవారం ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మండలంలోని చాప్టా(బీ) గ్రామంలోని హనుమాన్ ఆలయంలో దీక్షలు నిర్వహించారు. 40 రోజుల పాటు కఠోర దీక్ష చేసి మకర జ్యోతి దర్శనానికి బయలుదేరి వెళ్లినట్లు భక్తులు తెలిపారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు.

సామగ్రి వితరణ


విద్యాసామగ్రితో విద్యార్థులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సేవోధ్గమ్ ఫౌండేషన్ బాధ్యులు జయశ్రీ, కార్తీక్ మంగళవారం నోటుబుక్స్, బ్యాగులు, ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు తమవంతుగా సహకారం అందించాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గత కొన్నేళ్లుగా విద్యాసామగ్రిని అందజేస్తున్నట్లు దాతలు వివరించారు. ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ ఆచార్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా మోతిమాత జాతర ఏర్పాట్లు

ఎమ్మెల్యే మాణిక్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జహీరాబాద్ టౌన్: మరిగమ్మ మోతిమాత జాతర నిర్వహణలో భాగంగా భక్తుల సౌకర్యార్థం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదేశించారు. జాతర నిర్వహణపై మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, జాతర కమిటీ సభ్యులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనుల మోతిమాత జాతర ప్రసిద్ధి చెందిందన్నారు. జాతర ఉత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమై మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఏర్పా ట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, ఆర్డీఓ రాంరెడ్డి, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కిషన్ పవార్, అధ్యక్షుడిగా కేషుసింగ్ రా థోడ్, ప్రధాన కార్యదర్శిగా పవన్ రాథోడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు రూ.1.20 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, నాయకులు అంజయ్య పాల్గొన్నారు.

రైతు భరోసాపై మాట తప్పిన కాంగ్రెస్


నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): కాంగ్రెస్ సర్కారు రైతు భరోసాపై మాట తప్పిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ర్యాలీగా వెళ్లి రైతులను మభ్యపెట్టి ప్రభుత్వం మోసం చేసిందని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం రూ.15వేలు ఇస్తామని చెప్పి.. రూ.12వేలు మాత్రమే ఇస్తామనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ఆగ్రహానికి రాబోయే రోజుల్లో ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు ఫయాజ్, మొగులయ్య, వెంకట్, శ్రీనివాస్ రెడ్డి, వాసుదేవరెడ్డి స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు

సీఐ మహేశ్‌గౌడ్


మాట్లాడుతున్న సీఐ మహేశ్‌గౌడ్ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మహేశ్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో గాంధిచౌక్ ఇతర ప్రాంతాల్లో పతంగులు అమ్మే షాపులపై సీఐ మహేశ్‌గౌడ్, పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేశారు. చైనా మాంజాను విక్రయిస్తున్న ముగ్గురు వ్యాపారులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7400 విలువ గల 148 చైనా మాంజా ప్యాకెట్లను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ.. చైనా మాంజా అమ్మితే వాటి వల్ల ఎవరికైనా హాని జరిగితే అమ్మిన వ్యాపారులు, కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. చైనా మాంజా మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ మాంజాతో తలెత్తే అనర్థాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎవరైనా చైనా మాంజాను విక్రయిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు.

చైనా మాంజా అమ్మితే చర్యలు

ఝరాసంగం(జహీరాబాద్): సంక్రాంతిని పురస్కరించుకొని నిషేధిత చైనా మాంజా అమ్మితే చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేష్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి


వీల్ చైర్లను అందజేసిన లయన్స్‌క్లబ్ బాధ్యులు

నారాయణఖేడ్: ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రమేష్ పేర్కొన్నారు. ఖేడ్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి సూచన మేరకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, సభ్యుడు చంద్రశేఖర్ ఆచార్య, రాజుకుమార్ ప్రాంతీయ ఆస్పత్రికి రెండు వీల్‌చైర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, ఆస్పత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు. నాయకులు శంకర్ ముదిరాజ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లింగారెడ్డి మంగళారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులకు గడువు ఫిబ్రవరి 1 వరకు ఉందని తెలిపారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన


రికార్డుల గదిని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగం తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ మనోజ్ సందర్శించారు. మంగళవారం కార్యాలయాన్ని సందర్శించి, రెవెన్యూ అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని వివిధ గదులను పరిశీలించి, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. కార్యాలయం నిర్వహణ, సిబ్బంది విధులను పరిశీలించారు. కార్యాలయం నిర్వహణపై ట్రైనీ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు


పంటను పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్ సూచించారు. మంగళవారం మండలంలోని కృష్ణాపూర్ గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న పంట ప్రస్తుతం 30 నుంచి 40 రోజులు ఉందన్నారు. కాండం తొలుచు పురుగు సోకే అవకాశం ఉంటుందని దీని నివారణకు క్లోరాంత్రనిలిప్రిల్ 300 మిలీ, 200 లీటర్ల నీటితో పిచికారీ చేయాలన్నారు. అలాగే, 25 నుంచి 30 కార్బోఫ్యురెన్ గుళికలు ఎకరానికి 3కేజీలు ఆకుల సుడిలో వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సంపత్, రైతులు సంగమేష్, వీరన్న, యాదమ్మ, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై 'సూపర్ చెక్'

కంగ్టి(నారాయణఖేడ్): ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలుకు ప్రభుత్వం సర్వేపై సూపర్ చెక్ చేస్తున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. పంచాయతీ సెక్రటరీలు, ఇందిరా క్రాంతిపథం అధికారులు సర్వేల ఖచ్చితత్వం నిర్ధారణ కోసం రాండమ్‌గా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో నిర్వహించిన సర్వేలో 5 శాతం సూపర్‌చెక్ ఆప్‌తో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్, సంబంధిత పంచాయతీ సెక్రటరీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే

సదాశివపేట(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఉమ ఆదేశించారు. మంగళవారం పట్టణం 6వ వార్డులోని శ్రీ కృష్ణనగర్ కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఈ క్రమంలో లబ్ధిదారులు అందించే ధ్రువపత్రాల్లో ఉన్న సమాచారాన్ని క్రమపద్ధతిలో నమోదు చేయాలన్నారు. వార్డులో ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుండు రవి, ఆర్పీ సరళ, వార్డు ఆఫీసర్లు గణేశ్, నర్సింలు, లక్ష్మణ్ పాల్గొన్నారు.


రీ సర్వే చేస్తున్న ఎంపీడీఓ సత్తయ్య

చిట్కుల్ గ్రామంలో..

పటాన్‌చెరు టౌన్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం చిట్కుల్ గ్రామంలో నిర్వహించారు. పటాన్ చెరు ఎంపీడీఓ యాదగిరి, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్ పరిశీలించారు. సర్వే బృందం ఇంటిని, దరఖాస్తు దారుల ఖాళీ స్థలాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్న తీరును పరిశీలించారు. సర్వే ఎంతవరకు పూర్తి చేశారని పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో చిట్కుల్ గ్రామపంచాయతీ కార్యదర్శి కవిత, సిబ్బంది పాల్గొన్నారు.


సదాశివపేట: సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ ఉమ

కంది మండలంలో..

కంది(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. మంగళవారం మండలంలోని కాశిపూర్, కలివేముల గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు రూపొందించిన సర్వే నివేదికలను తనిఖీ చేశారు. ఇంటింటికి వెళ్లి దరఖాస్తుదారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఎవరైనా దరఖాస్తుదారులు అందుబాటులో లేకుంటే ఫోను ద్వారా వారికి సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులను జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సంధ్య జైపాల్ రెడ్డి, రాజిరెడ్డి, హనుమంత్‌రెడ్డి, కృష్ణరెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ బదిలీ

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారులోని విజయ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాములు మహబూబ్‌నగర్ అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని కేటాయించలేదు. మంగళవారం రాములును పాలఉత్పత్తిదారులు ఘనంగా సన్మానించారు.

◆ చైనా మాంజా విక్రేతల అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ ఆవరణలో నిషేధిత చైనా మాంజాలు విక్రయిస్తున్న దుకాణదారులు మహ్మద్ నాజీర్, రాజవల్లి ఈశ్వర్‌ని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. వారి నుంచి నాలుగు బండిళ్ల మాంజాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరుస్తామని పోలీసులు పేర్కొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరయిన చెక్కులను ఖేడ్‌లోని ఎమ్మెల్యే నివాసంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. కల్హేర్‌కు చెందిన కేశవ్వ, మహాదేవ్‌పల్లికి చెందిన సింగయ్య, సిర్గాపూర్ మండలం లంక తండాకు చెందిన రాథోడ్ జానకిరాం, కడ్పల్‌కు చెందిన సుగుణబాయి, విస్లావత్ పోమ్యానాయక్‌లకు చెక్కులు అందజేశారు. మనూరుకు చెందిన అరుణ్‌కు జిల్లా కాంగ్రెస్ నేత సుధాకర్‌రెడ్డి చెక్కు అందించారు.

◆ సదరం సర్టిఫికెట్లు అందజేత



సంగారెడ్డి: సదరం సర్టిఫికెట్లు ఇప్పటి నుంచి ఒకేరోజులో అందజేయనున్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం నిర్వహించిన సదరం క్యాంపులో మొత్తం 200 మంది స్లాట్లు బుక్ చేసుకోగా 132 మంది హాజరయ్యారు. అర్హతను బట్టి సదరం సర్టిఫికెట్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ అందజేశారు. ఇకపై నుంచి సదరం శిబిరం రోజే సర్టిఫికెట్లు అందిస్తామని ఆయన వెల్లడించారు.

◆ బాధిత కుటుంబానికి పరామర్శ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన మోతే నర్సింలు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ బాధితుడు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మొగులయ్య, సత్యనారాయణ, బాలరాజ్, బీరప్ప, శ్రీకాంత్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

◆ మండల కేంద్రంలో నీటి ఎద్దడి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలో ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని మహిళలు మండిపడుతున్నారు. నీటి సరఫరా కాకపోవడంతో సుదూరంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

◆ రాళ్ల భూముల్లో పండ్ల తోటలు



కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ఏడాది నాటిన పండ్ల తోటను మంగళవారం ఎంపీడీఓ సత్తయ్య, ఏపీఓ నర్సింలు పరిశీలించారు. మండలంలోని రాంతీర్థ్ గ్రామానికి చెందిన రైతు నాగన్న వ్యవసాయానికి యోగ్యంగా లేని భూమిలో మామిడి మొక్కలు పెట్టి పెంచడంపై ఎంపీడీఓ అభినందించారు. రాళ్లతో కూడిన భూమిలో మామిడి మొక్కలు పెంచడం.. మొదటి పూత దశలో ఉండడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

◆ గ్రామాభివృద్ధికి సహకరించాలి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కాజిపల్లి గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు మంగళవారం ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన సంసద్ ఆదర్శ గ్రామ యోజన పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని ఎంపీ రఘునందన్ రావు హామీ ఇచ్చారు.

◆ వృద్ధుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: వృద్ధుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామానికి చెందిన గిద్దెమిది వెంకయ్య (80), సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతకగా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ రోడ్డు సేఫ్టీపై అవగాహన

మునిపల్లి(అందోల్): రోడ్డు సేఫ్టీపై బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలంలోని కంకోల్ శివారు 65వ నంబర్ జాతీయ రహదారి సమీపం టోల్ ప్లాజా వద్ద సిబ్బందికి రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు సేఫ్టీకి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

◆ చెట్ల తొలగింపు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల నర్సాపూర్ జాతీయ రహదారి పక్కన భారీగా పెరిగిన చెట్లను పోలీసులు, ఫారెస్ట్ అధికారులు తొలగి ంపు చర్యలు చేపట్టారు. మంగళవారం జిన్నారం సీఐ నయాముద్దీన్ ఆధ్వర్యంలో పోలీసు ఫారెస్ట్ శాఖ అధికారులు అటవీ ప్రాంతంలోని జాతీయ రహదారి పక్కన రోడ్డుపైకి వచ్చిన భారీ చె ట్ల తొలగించారు. అధికారుల చర్యలతో మండల ప్రజలు, వా హనదారులు ప్రయాణికులు హ ర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి, ఫారెస్ట్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.